బోగస్‌పై ఫోకస్!

- ఒకటి కన్నా ఎక్కువగా ఉన్న ఓట్ల ఏరివేత ప్రక్రియ షురూ
- ఓటరు అభీష్టం మేరకు ఒకేచోట ఉండేలా చర్యలు
- సనత్‌నగర్ నియోజకవర్గంలో 14,598 మందికి ఒకటి కన్నా ఎక్కువ చోట్ల ఓటర్లుగా నమోదు


రాజకీయ నాయకులతో చర్చిస్తున్న డిప్యూటీ కమిషనర్ ముకుందరెడ్డి

సనత్‌నగర్: ఒకటి కన్నా ఎక్కువగా ఓట్లు ఉన్నవారిపై ఎన్నికల కమిషన్ దృష్టి సారించింది. అలాంటి వారిని ఇప్పటికే గుర్తించి వారి అభీష్టం మేరకు ఒక్కచోట మాత్రమే ఓటు హక్కు వినియోగించుకునేలా ఓటరు జాబితా ప్రక్షాళన చేపట్టింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ వడివడిగా సాగుతోంది. గత డిసెంబర్‌లో 'ఫొటో సిమిలర్ ఎంట్రీస్' (పీఎస్‌ఈ)ను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. సీఎస్‌ఈ ఆధారంగా సనత్‌నగర్ నియోజకవర్గంలో 14,598 మంది ఒకటి కన్నా ఎక్కువ చోట్ల ఓటరుగా నమోదై ఉన్నట్లుగా గుర్తించారు. కొందరు రెండుచోట్ల, మరికొందరు మూడుచోట్ల, ఇంకొందరు నాలుగైదు చిరునామాలపై ఓటర్లుగా ఉండడం గమనార్హం. ఓటరు జాబితాలో ఉన్న వీరందరి చిరునామాల ఆధారంగా బీఎల్‌ఓలు వారిని సంప్రదిస్తున్నారు. వారు ఎక్కడెక్కడ ఓటరుగా నమోదై ఉన్నారో వివరించి ఒక్కచోట మాత్రమే జాబితాలో పేరు ఉంచుకోవాలని నిర్దేశిస్తున్నారు. ఎక్కడ ఓటరుగా ఉండాలనే స్వేచ్ఛను వారికే వదిలేస్తున్నారు. వారు ఎంపిక చేసుకున్న చిరునామాను మినహాయించి మిగిలిన చోట్ల ఓటరు జాబితాలో పేర్లను తొలగించే ప్రక్రియ కొనసాగుతుంది. అందులో భాగంగా ముందుగా వారికి నోటీసులు అందజేసి ఎక్కడ ఓటరుగా నమోదై ఉండాలనే నిర్ణయం వెలిబుచ్చాల్సిందిగా సూచిస్తున్నారు. ఒకవేళ వారు పక్క నియోజకవర్గం, లేదా రాష్ట్రంలో ఎక్కడైనా నియోజకవర్గంలో తాము ఓటు హక్కు వినియోగించుకుంటామని చెబితే ఆ మేరకు వారి పేర్లను పరిశీలనార్థం ఆయా ప్రాంతాల ఈఆర్‌ఓలకు పంపిస్తారు. ఇదే క్రమంలో మిగిలిన చోట్ల ఉన్న పేర్లను తొలగిస్తారు.

30 శాతం పరిశీలన పూర్తి..

ఒక్కచోట కన్నా ఎక్కువ చోట్ల ఓటరు ఉన్నవారి చిరునామాల గుర్తింపు ప్రక్రియ ఇప్పటికే 30 శాతం పూర్తయ్యింది. నియోజకవర్గంలో గుర్తించిన 14,598 మందిలో 90 శాతం మంది రెండుచోట్ల ఓటు హక్కు ఉండగా, మిగిలిన వారు మూడు, నాలుగైదు చోట్ల ఓటు కలిగి ఉన్నారు. అందరికీ నోటీసులు జారీ చేశాక వారి ఇష్టానుసారం ఎక్కడైతే ఓటు హక్కు వినియోగించుకోవాలనుకుంటున్నారో ఆ ప్రాంతంలో ఓటు హక్కు కల్పించే క్రమంలో రాజకీయ పార్టీల నేతల అభ్యంతరాల స్వీకరణ కూడా చేపడతారు.


ఒక్కరికే మూడు చిరునామాల్లో ఓటు ఉన్న దృశ్యం

స్వల్పంగా తగ్గనున్న ఓటర్లు..

సనత్‌నగర్ నియోజకవర్గంలో మొత్తం 2,33,447 మంది ఓటర్లు ఉండగా పురుషులు 1,21,844, మహిళలు 1,11,598, ఇతరులు 5 మంది ఉన్నారు. అయితే ఒకటి కన్నా ఎక్కువ చోట్ల ఓటు హక్కు కలిగిన ఓటర్ల చిరునామాలను గమనిస్తే ఎక్కువ శాతం సనత్‌నగర్ నియోజకవర్గంలోనే ఉన్నప్పటికీ కొంతమంది మాత్రం సనత్‌నగర్‌తో పాటు ఇతర నియోజకవర్గాల్లోని చిరునామాలపై కూడా ఉన్నాయి. ఈ క్రమంలో వారు సనత్‌నగర్ కాకుండా ఇతర నియోజకవర్గంలో ఉన్న తమ చిరునామాలోనే ఓటు హక్కు వినియోగించుకుంటారనే నిర్ణయానికి వస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో మరో ఐదారు వేల ఓట్లు తగ్గే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

రాజకీయ నేతలతో సమావేశం..

ఎన్నికల సంఘం తీసుకువచ్చిన సంస్కరణలపై బుధవారం బేగంపేట సర్కిల్ కార్యాలయంలో రాజకీయ పార్టీ నాయకులకు సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. నియోజకవర్గ ఈఆర్‌ఓ, బేగంపేట డిప్యూటీ కమిషనర్ ముకుందరెడ్డి ఆయా సంస్కరణల గురించి వారికి వివరించారు. ముఖ్యంగా ఫొటో సిమిలర్ ఎంట్రీస్ ఆధారంగా ఒక్కరే రెండు, మూడు అంత కన్నా ఎక్కువ చోట్ల ఓటరు నమోదు కలిగిన వారిని గుర్తించి వారి ఇళ్లకు వెళ్లి వారికి ఇష్టమైన చోట ఓటరు జాబితాలో పేరు ఉంచి మిగతా చోట్ల తొలగించే ప్రక్రియ జరుగుతుందన్నారు. ఆధార్ సమాచారం స్వచ్ఛందంగానే సేకరించడం జరుగుతుందన్నారు. ఓటరు నుంచి గుర్తింపు పత్రం ఏదో ఒకటి సేకరించడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డితో పాటు వివిధ రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

బెంగళూర్‌లో అదృశ్యం..నగరంలో ప్రత్యక్షం


కర్ణాటక పోలీసులకు అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

సికింద్రాబాద్: భర్తతో గొడవపడి నగరానికి వచ్చి మూడు నెలలుగా మరో వ్యక్తితో సహజీవనం చేస్తున్న మహిళను బుధవారం జీఆర్‌పీ పోలీసులు కర్ణాటక పోలీసులకు అప్పగించారు. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన సలీం అన్సరీ– జన్నత్ ఖాతూన్ దంపతులు ఉపాధి కోసం బెంగళూర్ వెళ్లి జీవనం సాగిస్తున్నారు. గతేడాది అక్టోబర్‌లో భర్తతో గొడవ పడిన జన్నత్ ఖాతూన్ (22), ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయింది. ఫిర్యాదు అందుకున్న కర్ణాటక పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పోలీసుల విచారణలో జన్నత్‌ఖాతూన్‌తో పాటు పక్కింట్లో ఉంటున్న షోయబ్ అన్సారీ అనే యువకుడు కనిపించకుండా పోయినట్టు గుర్తించారు. ఇరువురిపై మిస్సింగ్ కేసు నమోదు చేసి లుకౌట్ నోటీసులు జారీ చేశారు. వీరిద్దరూ హైదరాబాద్‌లో కొన్ని నెలలుగా సహజీవనం చేస్తున్నారు. బుధవారం స్వగ్రామం వెళ్లేందుకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న వీరిని అదుపులోకి తీసుకుని కర్ణాటక పోలీసులను రప్పించి వారికి అప్పగించారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి


సమావేశంలో పాఠశాలల యాజమాన్య కమిటీ సభ్యులు

అడ్డగుట్ట: మనబస్తీ–మన బడి కార్యక్రమంలో భాగంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని పాఠశాలల యాజమాన్య కమిటీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆజాద్ చంద్రశేఖర్‌నగర్ పాఠశాలలో నిర్వహించిన పాఠశాలల యాజమాన్య కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల పరిధిలోని అన్ని పాఠశాలలను సందర్శించి మౌలిక వసతులు అవసరమున్న వాటిని గుర్తించాలన్నారు. స్కూల్ వాతావరణం, పరిసరాలు బాగా లేకపోవడంతో తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపడానికి ఆలోచిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి నెల పాఠశాల యాజమాన్య కమిటీ ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి అవసరాలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. విద్యార్థుల హాజరు శాతాన్ని కూడా పెంచే విధంగా ప్రయత్నించాలన్నారు. ఈ సమావేశంలో సీఆర్పీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు గోపి, హాజీ బేగం, ఎంవీ ఫౌండేషన్ ఆర్గనైజర్లు సువర్ణ, భాగ్య, సుమలత పాల్గొన్నారు.

ఆస్టర్ ప్రైమ్‌లో అరుదైన శస్త్రచికిత్స


చికిత్స అనంతరం వైద్యులతో సుమిత్ర

అమీర్‌పేట: అరుదైన అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ఓ మహిళకు ఆస్టర్ ప్రైమ్ వైద్యులు కొత్త జీవితాన్నిచ్చారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యులు వివరాలు వెల్లడించారు. వికారాబాద్ జిల్లా ఎన్నారం గ్రామానికి చెందిన 33 ఏళ్ల మహిళ సుమిత్ర తీవ్రమైన కడుపునొప్పితో ఆసుపత్రికి వచ్చింది. భోజనం చేసిన తర్వాత వస్తున్న కడుపునొప్పికి తోడు వికారం, వాంతులు, కడుపు ఉబ్బరం, ఆకలి తగ్గిపోవడం, బరువు తగ్గి ఊపిరితిత్తుల్లో ఇబ్బందులు తలెత్తి గుండెపోటు వచ్చిందన్న తరహా లక్షణాలతో బాధపడుతున్నట్లు తెలిపారు. పరిస్థితిని గమనించి కావాల్సిన వైద్య పరీక్షలు నిర్వహించారు. లాప్రోస్కోపిక్ విధానం ద్వారా ఊపిరితిత్తుల వద్ద ఆర్క్ ఆకారంలో ఉన్న టిష్యూను తొలగించామన్నారు. లక్ష మంది రోగులలో ఇద్దరు మాత్రమే 'డన్‌బార్స్ సిండ్రోమ్' అనే అనారోగ్య సమస్యలు వస్తాయని డాక్టర్ సృజన్‌కుమార్ తెలిపారు.

ఈ నెల 19 నుంచి ఫుట్‌బాల్ పోటీలు



మాట్లాడుతున్న అమూల్‌రాజ్

రసూల్‌పురా: యూనిటీ స్పోర్ట్స్ అకాడమీ చైర్మన్ పిఎల్. అరుల్‌రాజ్ సహకారంతో ఈ నెల 19 నుంచి తిరుమలగిరి ఫుట్‌బాల్ మైదానంలో కార్డినల్ డాక్టర్ పూల అంథోని ప్రైజ్‌మనీ ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. బుధవారం తిరుమలగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భారత ఫుట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్ విక్టర్ అమూల్‌రాజ్ మాట్లాడారు. గతంలో జంటనగరాల్లో ఫుట్‌బాల్‌కు అత్యంత ప్రాధాన్యం ఉండేదని ఎందరో ఫుట్‌బాల్ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ టోర్నీల్లో తమ సత్తా చాటారని గుర్తు చేశారు. కరోనా తర్వాత ఫుట్‌బాల్ క్రీడ పట్ల ఆదరణ తగ్గిందని ఆ క్రీడకు పునర్‌వైభవం తీసుకొచ్చేందుకు నాకౌట్ పద్ధతిన టోర్నీ నిర్వహిస్తున్నామన్నారు. అకాడమీ జనరల్ సెక్రటరి మైకెల్ అబ్రహం మాట్లాడుతూ.. ఈ టోర్నీలో జంటనగరాలకు చెందిన 16 జట్లు పాల్గొంటున్నాని విజేత జట్టుకు రూ.50, రన్నర్స్‌కు రూ.30 వేల ప్రైజ్‌మనీ ఉంటుందన్నారు. ఫుట్‌బాల్ మైదానానికి అనుమతి ఇచ్చిన బ్రిగేడియర్ సోమశంకర్, మైదానం అభివృద్ధికి సహకరించిన కంటోన్మెంట్ సీఈవో మధుకర్‌నాయక్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో అకాడమీ ట్రెజరర్ రేమాండ్ హార్‌వుడ్, ఆర్గనైజింగ్ సెక్రటరి ఐ. బెర్నార్డ్, మాజీ భారత జట్టు క్రీడాకారుడు ప్రతాప్ శీలన్ పాల్గొన్నారు.

సమాచారం

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.21, నల్ల వంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 55, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 25, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 32, పందిరిబీర 45, క్యాబేజీ 8, క్యారెట్ 15, దొండ 35, గుండుబీన్స్ 50, గింజ చిక్కుడు 40, గోకరకాయ 45, కీర 21, దోసకాయ 23, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 18, ఆలుగడ్డ 18, చామగడ్డ 60, మొరంగడ్డ 23, కందగడ్డ 35, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 9 (ఒకటి), మునగకాయ 4–6, ముల్లంగి 3–5. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాంగోపాల్‌పేట్: ఓయూ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ఆర్టీసీ ఆస్పత్రి, ఎన్ఐఎన్, తార్నాకా, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, హుడా, హెచ్ఎండీఏ ప్రాంతాలు. మధ్యాహ్నం 12గంటల నుంచి 1.30 గంటల వరకు రవీంద్రనగర్, మోడల్ స్కూల్ పీటీ, ధోబీఘాట్, ఈఎఫ్ఎల్ వెనుక వైపు, మాణికేశ్వరీనగర్ ప్రాంతాలు. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు మెట్టుగూడ పార్కు, రైల్వే క్లబ్, బీఎస్ఎన్ఎల్ ఎక్స్ఛేంజ్, అశోక లిబర్టీ, బొందలగడ్డ, కృపా అపార్ట్‌మెంట్, స్కైలాబ్ హోటల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అల్వాల్ సబ్ స్టేషన్ పరిధిలో..

కంటోన్మెంట్: చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అల్వాల్ సబ్ స్టేషన్ పరిధిలోని హెచ్ఎంటీ ఆఫీసర్స్ కాలనీ ఫీడర్ ప్రాంతాలు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు భూపతిరావు కాలనీ, చంద్రాపురం కాలనీ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

క్లుప్తంగా...

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న పద్మారావుగౌడ్

అడ్డగుట్ట: సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని కేసీఆర్ వీరాభిమాన సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. బుధవారం సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పాలడుగు గండయ్య, ప్రధాన కార్యదర్శి టీ. ప్రవీణ్‌కుమార్, సంఘం సభ్యులతో వెళ్లి డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌ను కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు.

బౌద్ధనగర్‌లో హాత్ సే హాత్ జోడో


కరపత్రాలు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సికింద్రాబాద్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హాత్ సే హాత్ జోడో కార్యక్రమం బుధవారం బౌద్ధనగర్ డివిజన్‌లో జరిగింది. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆదం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ వైఫల్యాలు ప్రజలకు వివరించి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆదం ఉమాదేవి, నాయకులు అనిల్‌కుమార్, జయరాజ, రాజుసాగర్, సందీప్, చక్రధర్, వహీదుద్దీన్, గౌస్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నియామకం


కేతినేని సరళ

అమీర్‌పేట: బీజేపీ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఫ్లోర్ లీడర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు, సెక్రటరీలు, విప్‌లు, అధికార ప్రతినిధులను బుధవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ ప్రకటించారు. ఫ్లోర్ సెక్రటరీగా అమీర్‌పేట కార్పొరేటర్ కేతినేని సరళ నియమితులయ్యారు.

కూన వెంకటేష్‌గౌడ్‌కు మాతృ వియోగం

సనత్‌నగర్: బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత కూన వెంకటేష్‌గౌడ్‌కు మాతృ వియోగం జరిగింది.ఆయన తల్లి కూన అంజమ్మ (85) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లోనే చికిత్స పొందుతున్నారు. బుధవారం ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నిబంధనలు పాటించండి.. సురక్షితంగా వెళ్లండి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శంకర్‌రాజు

సనత్‌నగర్: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపడం ద్వారా తమకు తాము సురక్షితంగా గమ్యానికి చేరుకోవడంతో పాటు తోటివారిని కూడా కాపాడినవారవుతారని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. జీబ్రా క్రాసింగ్ వద్దనే రోడ్డు దాటాలని, కదులుతున్న బస్సులను ఎక్కడం, దిగడం చేయరాదన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను అనుసరించడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలపై కుటుంబ సభ్యులకు సైతం అవగాహన కల్పించాలన్నారు. అలాగే ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, ఫోన్లకు వచ్చే ఓటీపీలను ఇతరకులకు షేర్ చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది వీరమ్మ, పద్మావతి, వెంకట ప్రసాద్, నర్సింహులు, ప్రధానోపాధ్యాయులు సుమన్ రాథోడ్ పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ సేవలు చిరస్మరణీయం


సేవాలాల్ జయంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే సాయన్న, మర్రి రాజశేఖర్‌రెడ్డి

రసూల్‌పురా: మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడిన సంత్ సేవాలాల్ బంజారాల ఆరాధ్యుడని కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి.సాయన్న అన్నారు. అంబేడ్కర్ హట్స్‌లో బంజారాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి కార్యక్రమంలో ఆయన బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ ప్రజల మేలు కోసం ధర్మ ప్రచారం, ఆర్థిక సంస్కరణలు, మత మార్పిడిలు అరికట్టడం, క్షేత్ర ధర్మాన్ని రక్షించడం తదితర వాటిపై ఉద్యమాలు చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సాయన్న మూడున్నర లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన పవర్‌బోర్‌వెల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నివేదిత, సాంబ అశోక్, బోర్డు మాజీ సభ్యులు బి. ప్రభాకర్, పాండుయాదవ్, ముప్పిడి మధుకర్, టీఎన్. శ్రీనివాస్, రాజు సింగ్, ప్రవీణ్ యాదవ్ పాల్గొన్నారు.

మత్తు, ధూమపానం శాపం అని హితవు పలికిన సంత్ శ్రీ సేవాలాల్ యావత్తు ప్రజలకు ఆదర్శపురుషుడయ్యాడని శ్రీ గణేష్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీ గణేష్ తెలిపారు. మడ్‌ఫోర్ట్ అంబేడ్కర్ హట్స్‌లో నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతిలో శ్రీ గణేష్ పాల్గొని మాట్లాడారు.

అమీర్‌పేటలో..

అమీర్‌పేట: బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని కార్పొరేటర్ సరళ పేర్కొన్నారు. బుధవారం అమీర్‌పేటలో నిర్వహించిన సేవాలాల్ జయంతిలో ఆమె పాల్గొన్నారు. బాపూనగర్ బంజారా బస్తీలోని 100 సంవత్సరాల చరిత్ర కలిగిన మహరాజ్ జగదాంబ భవానీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భోగ్, బండార్ నైవేద్యం (బెల్లంతో చేసిన తీపి పదార్థం ప్రసాద రూపంలో యజ్ఞ గుండంలో సమర్పించడం) అనంతరం ఎస్ఆర్‌నగర్ నుంచి అమీర్‌పేట భగత్‌సింగ్ విగ్రహం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో బంజారా నాయకులు చెరణ్‌సింగ్, హాయ్ రాథోడ్, రాహుల్ నాయక్, హేమంత్ నాయక్, లక్ష్మిలాల్‌సింగ్, భారతి అర్జున్ సింగ్ పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్ కార్యాలయంలో..



లాలాపేట: బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ సేవలు మరువలేనివని గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి అన్నారు. బుధవారం తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో సంత్ సేవాలాల్ జయంతి నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశం గర్వించదగ్గ గొప్ప ఆధ్యాత్మికవేత్త, సంఘ సేవకులు అని ఆయన ఆశయసాధనలో నేటి బంజారాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మోతే శోభన్ రెడ్డి, అంజన్న, అనీల్ సర్వదే, బాబు పాల్గొన్నారు.

ఘనంగా పుట్టినరోజు వేడుక


మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో కొలను బాల్‌రెడ్డి

సనత్‌నగర్: బీఆర్ఎస్ పార్టీ సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. సనత్‌నగర్ బస్టాండ్‌లో సీనియర్ నేత ఖలీల్‌బేగ్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. డివిజన్ మాజీ అధ్యక్షుడు సరఫ్ సంతోష్ పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అంతకు ముందు కొలను బాల్‌రెడ్డి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాసానికి వెళ్లగా మంత్రి ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, సత్యనారాయణయాదవ్, రాజేష్‌ముదిరాజ్, సురేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సు ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

ఉస్మానియా యూనివర్సిటీ: హైదరాబాద్ విమోచన ఉద్యమంపై బుధవారం ఓయులో అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. సంస్కృతం, హిందీ, మరాఠీ, కన్నడం విభాగాలతో స్వాతంత్య్ర సమరయోధుడు గంగారాం స్మారక్ మంచ్ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఆర్ట్స్ కాలేజీలోని 133వ ఈ–క్లాస్ రూంలో హైదరాబాద్ ముక్త్ ఆందోళన్ కే స్వతంత్ర సేనాని, ఇండియా భాషలు అనే అంశం జరిగిన కార్యక్రమానికి ప్రిన్సిపల్ ప్రొ.గణేష్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా మహారాష్ట్రకు చెందిన మహేంద్రగోపాల్ హాజరై జ్యోతి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బన్సీలాల్, శ్యాంలాల్, మహాత్మా నారాయణస్వామి, నారాయణ్‌రావు పవార్, జగదీష్ మున్నర్, ప్రతిభ జీ, రశ్మిద్వివేది, డాక్టర్ ధర్మతేజ పాల్గొన్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

సికింద్రాబాద్: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం... చింతల్‌కు చెందిన గుండు వెంకటేష్ (20) బైక్ మెకానిక్. అమ్ముగూడ–సనత్‌నగర్ రైల్వేస్టేషన్ల మధ్య బుధవారం వెంకటేశ్ పట్టాలు దాటుతున్న క్రమంలో వేగంగా వచ్చిన గూడ్స్‌రైలు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు.

ఓయూ జిల్లా పీజీ కాలేజీల్లో ప్రిన్సిపాల్ పదవి రద్దు

- కోఆర్డినేటర్లతో కార్యకలాపాలు
- చెల్లని సంతకాలతో విద్యార్థుల అవస్థలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని జిల్లా పీజీ కాలేజీల ప్రిన్సిపాల్ పదవులను రద్దు చేశారు. వర్సిటీ పరిధిలోని సిద్ధిపేట, జోగిపేట, వికారాబాద్, నర్సాపూర్, మిర్జాపూర్‌లలో ఐదు జిల్లా పీజీ కాలేజీలు కొనసాగుతున్నాయి. నగరానికి దూరంగా ఉండటంతో పర్మనెంట్ అధ్యాపకులు జిల్లా కాలేజీల్లో పని చేసేందుకు ముందుకు రావడం లేదు. దీంతో కొన్ని ఏళ్లుగా పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను ప్రిన్సిపల్స్‌గా నియమిస్తున్నారు. కాంట్రాక్టు అధ్యాపకులకు ప్రిన్సిపల్ పదవులను రద్దు చేసి కోఆర్డినేటర్లను నియమించారు. అయినా ప్రిన్సిపాల్స్ విధులు కోఆర్డినేటర్ల నిర్వహిస్తున్నారు. అయితే.. కోఆర్డినేటర్‌గా చేసే సంతకాలు చెల్లకపోవడంతో బస్‌పాస్‌లు, స్టడీ సర్టిఫికెట్లు, టీసీలు, స్కాలర్‌షిప్‌లు తదితర దరఖాస్తులు తిరస్కరణకు గురవుతుండటంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముందు చూపు లేకుండా ఓయూ అధికారులు తీసుకున్న ప్రిన్సిపల్ పదవుల రద్దుతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కోఆర్డినేటర్ల సంతకాలు కేవలం ఓయూ కార్యకాలపాలకు మాత్రమే చెల్లుతున్నాయి. ఈ విషయాన్ని ఓయూ అధికారులకు దృష్టికి తీసుకురాగా కోఆర్డినేటర్‌గా కొనసాగుతూనే ప్రిన్సిపల్‌గా సంతకం చేయాలని సూచించారు. ఇందుకు అంగీకరించని కాంట్రాక్టు అధ్యాపకులు కోఆర్డినేటర్లు తమ పదవుల రాజీనామాలకు సిద్ధపడుతున్నారు. విద్యార్థుల సర్టిఫికెట్ల పై సంతకాల దృష్ట్యా ప్రిన్సిపాల్ పదవుల్లో తిరిగి కాంట్రాక్టు అధ్యాపకులను నియమించాలని లేదా పర్మనెంట్ అధ్యాపకులను జిల్లా పీజీ కాలేజీలకు బదిలీ చేయాలన్నారు.

మనుస్మృతిని ఏ దేశం అంగీకరించదు

ప్రొ. గాలి వినోద్‌కుమార్



లాలాపేట: ప్రపంచ మానవ హక్కుల ప్రకటన 1948 ప్రకారం భారతదేశ రాజ్యాంగ సమానత్వ సూత్రాలకు విరుద్ధమైన మనుస్మృతిని ప్రపంచంలో ఏ దేశం అంగీకరించదని దక్షిణ భారత సమితి కన్వీనర్ ప్రొ. గాలి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్య అసమాన వర్ణకుల ధర్మాల పరిరక్షణ కోసం ఏర్పడిన మనుస్మృతిని 1927 డిసెంబర్ 25న భారత రాజ్యాంగ నిర్మాత డా. బిఆర్. అంబేడ్కర్ తగలబెట్టారని వివరించారు. ప్రాచీన రాజ్యాంగం పేరుతో బ్రాహ్మణులు, అగ్రవర్ణాలు నయా బానిసత్వాని బహుజనులపై రుద్దడానికి ప్రయత్నిస్తున్నారని వారి ప్రయత్నాలను తిప్పికొట్టడానికి బహుజనులంతా ఏకం కావాలన్నారు. వాడ వాడలా మనుస్మృతిని తగులబెట్టాలని పిలుపునిచ్చారు.